క్లుప్తంగా

కుటుంబ సర్వే పరిశీలన

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం, చౌటపల్లి, మఠంపల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను గురువారం ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్ పరిశీలించారు. సర్వేలో పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. కార్యదర్శులు రాజా, వెంకటేశ్వర్లు, విజయ, జూనియర్ అసిస్టెంట్ మట్టయ్య, ఏఎపి వెంకటమ్మ ఉన్నారు.

కలెక్టర్‌పై దాడికి నిరసన

మునగాల : వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారులపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ కోరారు. దాడిని ఖండిస్తూ గురువారం మునగాల ఎండీఓ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు బహూకరణ


కుర్చీలు అందజేస్తున్న ఉపేందర్, మమత

హుజూర్‌నగర్ : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం –5కు హుజూర్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త జూలకంటి చిన్నఅప్పారావు సతీమణి భాగ్యలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు ఉపేందర్, మమత గురువారం రూ.7 వేల విలువ గల 10 కుర్చీలు, పిల్లల ఆట వస్తువులు బహూకరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోమమ్మ, అంగన్‌వాడీ టీచర్ ఆకుల రజిని, ఆయా ఉమ, రాము, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలో జాగ్రత్తలు తప్పనిసరి

మునగాల : వరి పైరు కోసేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ వి.ఆంజనేయులు కోరారు. గురువారం మునగాల తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వరికోత మిషన్ల డ్రైవర్లు, ఏజెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తాలు, పొల్లు రాకుండా యంత్రం నడిపే విధానం, బ్లోయర్, గేర్లు, స్పీడ్ గురించి అవగాహన కల్పించారు. వరి గింజ పూర్తిగా ఎండిన తర్వాతనే కోయాలని, పచ్చిగా ఉన్న వరి ధాన్యాన్ని కేంద్రాల్లో పోస్తే మ్యాచర్ రాక రైతులు ఇబ్బందులు పడతారని తెలిపారు. సమావేశంలో ఏఓ బుంగా రాజు, ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్, ఏఈఓలు, ఐకేపీ, పీఏసీఎస్ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టక రైతులకు ఇబ్బందులు

గరిడేపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై 20 రోజులు అవుతున్నా నేటికీ ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ అన్నారు. గురువారం మండలంలోని కీతవారిగూడెంలో గల ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం ఆధ్వర్యంలో పరిశీలించి మాట్లాడారు. త్వరితగతిన ధాన్యం కాంటాలు వేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మల సైదయ్య, దోసపాటి భిక్షం, ఎమగాని వెంకటేశ్వర్లు, యల్లావుల నారాయణ, మీసాల మట్టయ్య, రావిరాల శ్రీను పాల్గొన్నారు.

ఓపెన్ ఐస్ సొసైటీ చేయూత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన బడిశ వీరయ్య–మౌనిక దంపతుల కూతురు 22 నెలల శాన్వికి న్యూమోనియతో ఆర్గాన్స్ దెబ్బతినడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులు రూ.5 వేలు ఆర్థికసాయాన్ని గురువారం హైదరాబాద్‌లో అందజేశారు. సంస్థ సభ్యులు రాము, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

సీపీఎం జిల్లా మహాసభ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మఠంపల్లి : సూర్యాపేటలోని గాంధీ పార్క్‌లో ఈనెల 29న జరిగే సీపీఎం జిల్లా 3వ మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ కోరారు. గురువారం మఠంపల్లిలో పార్టీ నాయకులతో కలిసి మహాసభ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కార్యదర్శి బాలునాయక్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రన్ మియా, వెంకటరెడ్డి, రాము, హరినాయక్, తిరుపతయ్య, రాజు, లక్ష్మమ్మ, రవి పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి హుస్సేన్ కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్మారక భవనంలో మండల కమిటీ సమావేశంలో మహాసభల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ నాయకులు టి.వెంకటచంద్ర, లక్ష్మీనరసమ్మ, నరసింహాచారి, ఖాసీం, భిక్షం, వెంకటయ్య, వీరస్వామి, వెంకట్‌నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు విద్యాలయాల్లో స్వపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. –సాక్షి నెట్‌వర్క్


మఠంపల్లి : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నెహ్రూ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


మోతె : అల్లూరి సీతారామరాజు వేషధారణలో చిన్నారి


మేళ్లచెరువు : గాంధీనగర్‌తండాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఫ్యాషన్ షో


నడిగూడెం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు


చిలుకూరు : నారాయణపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వపరిపాలన దినోత్సవం


హుజూర్‌నగర్‌రూరల్ : శ్రీనివాసపురంలోని ప్రాథమిక పాఠశాలలో..


మునగాల : జగన్నాథపురంలోని ప్రభుత్వ పాఠశాలలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


నేరేడుచర్ల : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


చిలుకూరు : బేతవోలు జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వపరిపాలన దినోత్సవం


మఠంపల్లి : పాతదొనబండతండాలోని ప్రాథమిక పాఠశాలలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


హుజూర్‌నగర్ : ఎండీఆర్ స్కూల్‌లో..


గరిడేపల్లి : కేజీబీవీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మద్దతు ధర రాక నిరాశలో రైతులు

హుజూర్‌నగర్ : ధాన్యానికి మద్దతు ధర రాక రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కొప్పోజు సూర్యనారాయణ, పల్లె వెంకట్‌రెడ్డి, ఎల్లావుల రాములు అన్నారు. మిల్లర్లు రైతుల ధాన్యానికి మద్దతు ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపి కార్యాలయ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని చెబుతున్నా మిల్లర్లు అనేక రకాల కొర్రీలు పెట్టి మద్దతు ధర ఇవ్వటం లేదని తెలిపారు. అన్ని రకాల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, నాయకులు దుగ్గి బ్రహ్మం, పి.వాసుదేవరావు, వి.సైదులు, జె.రమేష్, ఎస్.శ్రీను, ఎం.నరసయ్య, జె.రమణ, మురళి, వీరబాబు, యోనా, వెంకటనారాయణ, వెంకట్, సోమయ్య పాల్గొన్నారు.

టోకెన్ల ప్రకారం ధాన్యం తీసుకెళ్లాలి

నేరేడుచర్ల : టోకెన్ల ప్రకారం రైతులు రైస్ మిల్లుల్లో ధాన్యం విక్రయించుకోవాలని తహసీల్దార్ సురిగి సైదులు, మండల వ్యవసాయ అధికారి జావేద్ సూచించారు. మిర్యాలగూడలోని రైస్ మిల్లుల్లో ధాన్యం విక్రయించేందుకు గురువారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద రైతులకు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్‌ఐ రవీందర్‌నాయక్‌తో కలిసి టోకెన్లు అందజేసి మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని రైతులు మిర్యాలగూడలోని మిల్లులకు వెళ్లేందుకు ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు పూర్తిగా గింజ ఏర్పడిన తర్వాతనే పంట కోసి తాలు లేకుండా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, కౌన్సిలర్ రణపంగ నాగయ్య, వీరయ్య, బెల్లంకొండ నర్సింహారావు, సైదులు, పాండునాయక్ తదితరులు ఉన్నారు.


చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద రైతులకు టోకెన్లు పంపిణీ చేస్తున్న సీఐ, తహసీల్దార్, నాయకులు

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యాహవచనం, బాలభోగం, నిత్యపూర్ణాహుతి, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, సేవాకాలం, మంగళాశాసనం, పాశురతాత్పర్యం నిర్వహించారు. అనంతరం ఆలయంలో శ్రీగోదాదేవికి పల్లకీసేవ, తీర్థప్రసాదగోష్టి, ఆరగింపు తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ ఎంపి లక్ష్మణరావు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్, ధర్మకర్తలు

వారోత్సవాలకు నోచుకోని గ్రంథాలయం


చిలుకూరు బాపూజీ శాఖా గ్రంథాలయం

చిలుకూరు : ఘన చరిత్ర కలిగిన చిలుకూరు బాపూజీ శాఖా గ్రంథాలయం ఈ ఏడాది గ్రంథాలయ వారోత్సవాలకు నోచుకోలేదు. జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నా మండలానికే మణిహారంగా ఉన్న చిలుకూరు బాపూజీ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ప్రస్తావనే లేదు. ఆంధ్ర మహాసభ జరగడానికి ప్రధాన వేదికగా చిలుకూరు గ్రంథాలయం నిలిచింది. అలాంటి గ్రంథాలయం నేడు వేడుకలు లేక వెలవెలబోతోంది. అయితే ఇటీవల నూతన గ్రంథాలయ భవనాన్ని కూడా నిర్మించారు. అయినా కనీసం గ్రంథాలయం ఆవరణలో గల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాథుడే లేరు. ఒకప్పుడు చిలుకూరులో గ్రంథాలయ వారోత్సవాలు వచ్చాయంటే పండుగ వాతావరణం ఉండేది. ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రముఖుల చేత ఉపన్యాసాలు, సమావేశాలు, విద్యార్థులకు క్రీడా పోటీలు, మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలు, చివరి రోజున బహుమతులు అందజేసేవారు. అలాంటి గ్రంథాయలం నేడు కేవలం కరెంట్ బిల్లులు వసూలు చేసుకొనే కేంద్రంగా మారిపోయింది. అయితే గ్రంథాలయానికి రెగ్యులర్ అధికారి లేరు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ అధికారే కొనసాగుతున్నారు. ఒక అటెండర్ ఉన్నారు. అటెండర్ ప్రతిరోజు గ్రంథాలయం తలుపులు తీస్తుండడంతో కొంత మంది విద్యార్థులు అక్కడ చదువుకుంటారు. ఇప్పటికైనా గ్రామంలోని ప్రముఖులు, మేధావులు ఆలోచించి గ్రంథాలయానికి పూర్వవైభవం తీసుకురావాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

బాల్యం.. వీధుల్లోనే


ప్లాస్టిక్ వస్తువుల కోసం రోడ్డు వెంట తిరుగుతున్న బాలలు

చిలుకూరు : బాల్యం బడిలోనే గడపాలని, చెత్త కుప్పల్లో, బాల కార్మికులుగా బందీ కావద్దని ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చినా అవి క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. అక్షరాలు దిద్దాల్సిన చేతులు ఇంకా చిత్తు కాగితాలు ఏరుకుంటున్నాయి. గురువారం బాలల దినోత్సవం రోజున కోదాడ పట్టణ పరిధిలో ఇద్దరు బాలలు ప్లాస్టిక్ వస్తువుల కోసం సైకిల్‌పై తిరుగుతూ ఇలా సాక్షి కెమెరాకు చిక్కారు.

డిసెంబర్ 14 నుంచి కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లాలోని మండలాల నూతన కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలు డిసెంబర్ 14 నుంచి 18వ తేదీవరకు నిర్వహించనున్నట్టు అడహక్ కమిటీ చైర్మన్ ఆర్.భూలోకరావు, నాయకుడు జి.కర్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 14న తుంగతుర్తి నియోజకవర్గంలోని మండలాల్లో, 15న సూర్యాపేట నియోజకవర్గంలోని మండలాలు, 17న కోదాడ నియోజకవర్గంలోని మండలాలు, 18న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ని మండలాల్లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నట్టు వివరించారు.

శ్రీనివాస్‌రెడ్డికి పరామర్శ

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి ఇటీవల మృతి చెందారు. గురువారం పలువురు నాయకులు వెంకటరెడ్డి చిత్రం వద్ద నివాళులర్పించి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్లు నంబూరి సూర్యం, డేగ బాబు, నాయకులు వనపర్తి లక్ష్మీనారాయణ, సుందరి వెంకటేశ్వర్లు ఉన్నారు.

విభళాపురం చేరుకున్న హిందూ చైతన్య రథయాత్ర


రథయాత్రలో మాలధారులు, తదితరులు

మోతె : ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన హిందూ చైతన్య రథయాత్ర గురువారం మోతె మండలంలోని విభళాపురం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు అయ్యప్పమాలధారులు, మహిళలు, భక్తులు రథయాత్రకు స్వాగతం పలికారు. గ్రామంలో రథయాత్రను విజయవంతం చేశారు.

పశు ఔషధ బ్యాంకు ప్రారంభం


పశు పోషకులకు మందులు అందజేస్తున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు

కోదాడరూరల్ : పశు ఔషధ బ్యాంకును పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన పశు ఔషధ బ్యాంకును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశు పోషకులకు చేయూతనందించేందుకు కోదాడ ప్రాంతీయ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పెంటయ్య వినూత్న ఆలోచనతో దాతల సహకారంతో ఔషధ బ్యాంకును ఏర్పాటు చేసి ఉచితంగా అందజేయడం గొప్ప విషయమన్నారు. ఔషధ బ్యాంకుకు యూఎస్‌ఏలో పశువైద్యాధికారిగా పనిచేస్తున్న వై.వెంకటరమణారెడ్డి రూ.50 వేలు, కాపుగల్లుకు చెందిన ముత్తవరపు పూర్ణచందర్‌రావు రూ.50వేల విలువ చేసే కాల్షియం టానిక్‌ను అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కోదాడ ప్రాంతీయ పశువైద్యాధికారి డాక్టర్ పెంటయ్య, చిలుకూరు పశువైద్యాధికారి కె.వీరారెడ్డి, డాక్టర్ మధు సిబ్బంది, పాడి రైతులు ఉన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎర్రవరం ప్రాథమిక పశువైద్యశాలలో గాలికుంటు టీకాల పంపిణీపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడ పశువైద్యాధికారి డాక్టర్ పెంటయ్య, మండల పశువైద్యాధికారి డాక్టర్ మధు, డాక్టర్ వీరారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

శిక్షణతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- డీఐఈఓ భానునాయక్


ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులపై శిక్షణను పరిశీలిస్తున్న డీఐఈఓ భానునాయక్

నేరేడుచర్ల : ఆన్ జాబ్ శిక్షణ ఇంటర్మీడియట్ వృత్తి విద్య కోర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాకారి భానునాయక్ అన్నారు. గురువారం నేరేడుచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ వృత్తి విద్య కోర్స్ విద్యార్థులకు మండల పరిషత్ కార్యాలయం, గ్రోమోర్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, దిర్శించర్లలోని సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులపై ఇచ్చిన శిక్షణను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో ఓజేటీ తరగతులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు కె.శ్రీనివాస్, సీహెచ్.వెంకన్న, ఎం.ప్రసాద్, వీరునాయక్, అపర్ణ, వీరేష్ తదితరులు ఉన్నారు.

రాజకీయ చతురుడు ‘వేనేపల్లి’

- జూలూరి గౌరీశంకర్


మాట్లాడుతున్న జూలూరి గౌరీశంకర్

కోదాడ : మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు రాజకీయ చతురుడని, కోదాడ రాజకీయాల్లో చందర్‌రావు ముద్రను తొలగించలేమని, చందర్‌రావు లేని కోదాడ రాజకీయం సంపూర్ణం కాదని సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు 60వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రిటైర్డు అధ్యాపకుడు శ్రీరామకవచం వెంకటేశ్వర్లు చందర్‌పై రాసిన ‘రాజతంత్రం’పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతి ఆధ్వర్యంలో చందర్‌రావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ప్రగడ భరత్‌రావు, లక్ష్మీనారాయణరెడ్డి, అందె సత్యం, గంధం బంగారు, పారా సీతయ్య, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

కోదాడ పట్టణంలోని బాలుర పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవంలో ఎమ్మెల్యే పద్మావతి పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో దాత సజ్జా త్రివేది ఏర్పాటు చేసిన వాటర్ ప్లాట్‌ను ఆమె ప్రారంభించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


గణపవరంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

మునగాల : జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి కోరారు. గురువారం మునగాల మండలంలోని గణపవరంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లులు, ఐకేపీ కేంద్రాల ద్వారా ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకేపీ కేంద్రాలలో బస్తాల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చందా చంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వీరబోయిన వెంకన్న, బచ్చలకూర స్వరాజ్యం, జూలకంటి విజయలక్ష్మి, షేక్ సైదా, డి.స్టాలిన్‌రెడ్డి, బి.ఉపేందర్, బోళ్ల కృష్ణారెడ్డి, మండవ వెంకటాద్రి, సతీష్, పిచ్చయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం


హుజూర్‌నగర్ : పీఏసీఎస్‌లో జెండా ఎగురవేస్తున్న అధ్యక్షుడు నరేందర్


కోదాడరూరల్ : కాపుగల్లు పీఏసీఎస్‌లో జెండా ఆవిష్కరిస్తున్న చైర్మన్ నంబూరి సూర్యం

కోదాడరూరల్ : రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యమమని కాపుగల్లు పీఏసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా గురువారం కాపుగల్లు పీఏసీఎస్‌లో సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు సంఘాల బలోపేతానికి సహకరించాలని కోరారు. అదేవిధంగా ఎర్రవరంలో పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు సహకార సంఘం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఆయా సొసైటీల డైరెక్టర్లు, సీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గురువారం అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు జక్కుల నరేందర్‌యాదవ్ సహకార జెండా ఎగరవేశారు. అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కె.మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు డి.మల్లేశ్వరి, డి.బ్రహ్మం, కె.శ్రీను, కె.పద్మ, ఆర్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి పాటుపడాలి

గరిడేపల్లి : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి రైతులు పాటుపడాలని పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం కీతవారిగూడెం పీఏసీఎస్ కార్యాలయంలో సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మంగళగిరి కృష్ణ, దాసరి నర్సమ్మ, బాల్తూరి అంజయ్య, సీఈఓ కనకయ్య, అంజయ్య, శ్రీనివాస్, సైదులు కాంగ్రెస్ పార్టీ నాయకులు సైదయ్య, ముత్తినేని సోమయ్య, చెన్నగాని మహేష్, ముత్తినేని కోటేశ్వరరావు, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి


విద్యుత్ వెలుగుల్లో మట్టపల్లి ఆలయం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం జరిగే కార్తీక పౌర్ణమి వేడుకలకు ఆలయ పాలకవర్గ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. పవిత్ర కృష్ణానదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించారు. భక్తులు నరసింహస్వామి దర్శనానికి, శివాలయంలోని శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి దర్శనానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో పరిశుభ్రం చేశారు. కాగా, ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్‌లు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఆలయం ఆవరణలో భక్తులకు తాగునీరు, అన్నదానం, ప్రసాదాలు ఉంటాయన్నారు. వివిధ కులాల అన్నదాన సత్రాల్లో కూడా భోజన వసతి ఉంటుందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం శివాలయంలో శివ కల్యాణం ఉంటుందని వారు పేర్కొన్నారు.